
# జర్నలిస్ట్ కథలు



# తారకరావు ప్రెస్ కాన్ఫరెన్సు

సారా ఉద్యమం ప్రతిపక్ష నాయకుడు తారకరావుకి బాగా నచ్చింది.

ఈ ఉద్యమం ధర్మవా అని ఎక్కడికి వెళ్ళినా లారీల్లో చేరెయ్యాల్సిన అవసరం లేకుండానే జనం ఎగబడుతున్నారు. హారతి కర్పూరం దుకాణం తగలబడినప్పుడు ఊరి జనం అంతా ఇష్టదైవాలకు ప్రార్థనలు చేసుకున్న స్టయిల్‌లో సారా ఉద్యమం కోసం జనం గుమిగూడిన ప్రతిచోటికీ వెళ్ళి వచ్చే ఎన్నికల్లో మీ వోటు నాకే అని చెప్పేసి వొచ్చేస్తున్నాడు. చివర్న మాత్రం తను ముఖ్యమంత్రి కాగానే ఈ సారాని మనసారా నిషేధిస్తానంటున్నాడు. దాంతో జనం ఉద్రూతలూగిపోతున్నారు. ఇలా ఈ మధ్య కాలంలో తన మీటింగుల్లో జనం ఎప్పుడూ పుర్రూతలూగకపోవడం వల్ల తన గ్లామరు విపరీతంగా పెరిగిపోయిందని అతగాడికి నమ్మకం కుదిరేసింది.

సారా సమస్య మీద మరింత చెలరేగిపోదామని డిసైడ్ చేసుకున్నాడు. అంచేత ఓ సాయంత్రం ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాడు– ఆరుగంటలకి.

రాత్రి తొమ్మిద్దాకా చూసినా ఒఖ్ఖ ప్రెస్సువాడూ రాలేదు.

'మనం మీటింగు పెడితే ఇనకేస్తే రాలటం లేదు గదా మరి మన ప్రెస్ కాన్ఫరెన్స్‌కి జనం రారేం" అన్నాడు ఆందోళనగా.

"ఇనకేస్తే రాలని సంగతి ఇంకా ప్రెస్సు వాళ్ళ దృష్టికి రాలేదేమోసార్" అన్నాడు పి.ఏ. లౌక్యంగా.

"అయితే ఫోన్లు చెయ్యి వాళ్ళందరికీ. ఇనకేస్తే ఈ మధ్య రాలటం లేదని చెప్పు" అన్నాడు తారకరావు.

పి.ఏ.కి తల గోడకేసి బాదుకోవాలనిపించింది. మునలాడికి లౌక్యం అసలు తెలీదు.

"అసలు విషయం ఏమిటంటే సార్ ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ పొద్దున్న పెడితే బావుండేది సార్." అన్నాడు పి.ఏ. కాస్త సిగ్గుపడుతూ.

"పొద్దున్న ఏల పెట్టవలెను? మన ఇష్టం వచ్చినప్పుడు పెట్టెదము. వారెవరు మమ్ము శాసించుటకు" అంటున్నాడు తారకరావు కోపంగా.

తారకరావుకి కోపం వొచ్చిందంటే గ్రాంధికంలోకి వెళిపోతాడు. ఎవరు చెప్పినా వినిపించుకోడు.

"వాళ్ళేం శాసించరు సార్. రాజ్యాంగం ప్రకారం చూసినా కూడా మన ఇష్టం వచ్చిన టైములో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టుకోవచ్చు సార్. ప్రాబ్లం ఏవిటంటే వాళ్ళు రారు సార్. ఎందుకంటే ఆ టైములో వాళ్ళు వేరే పనిలో వుంటారు సార్" అన్నాడు పి.ఏ. అనునయంగా.

ఈ మాత్రం లౌక్యంగా చెప్పినా మునలాయనకు అర్థం కాదనే విషయం తెలును పి.ఏ.కి. అందుకే 'వాళ్ళనీ టైములో పిలిస్తే కాక్‌టైల్స్‌కే పిలవాలి సార్' అనేశాడు.

'అంటే మద్యమును వ్యతిరేకించే ఉద్యమ నాయకుడే మద్యపానము ప్రోత్సహించవలెనా" అన్నాడు తారకరావు బాధగా. బాధ పడ్డప్పుడు కూడా అతను గ్రాంధికమే మాట్లాడుతాడు.

"ప్రోత్సహించక్కర్లేదు సార్! అక్కడో నాలుగు సీసాలు, సోడాలూ పెడితే వాళ్ళే ప్రోత్సహించేసుకుంటారు" అన్నాడు పి.ఏ.

తారకరావుకి తనంత మహానాయకుడు పిలిస్తే కూడా రిపోర్టర్లు క్షుద్రమైన విస్కీ గ్లాసు అడుగుతారంటే నమ్మబుద్ధి కావటం లేదు.

పి.ఏ. అనునయంగా చెప్పాడు.

"తప్పదు సార్. వసుదేవుడికే తప్పలేదు. మనమెంత. మీరు ఊ అనండి. రేపు మళ్ళీ ఎరేంజ్ చేస్తా. మీరు చెప్పే నాలుగు ముక్కలూ చెప్పేసి వెళిపోండి. మిగిలిన కార్యక్రమం నే చూసుకుంటా."

వసుదేవుడు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి విస్కీ ఇప్పించినట్టు తను చదివిన ఏ చందమామలోనూ రాయలేదు. తను చదవనప్పుడు ఒకవేళ వసుదేవుడు గానీ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాడేమో. ఆ మాట అడిగితే తనకి ఆట్టే నాలెడ్జి లేని విషయం పి.ఏ. గాడికి తెలిసిపోతుంది. అంచేత "సరే! వసుదేవుడికే తప్పనప్పుడు మనకి తప్పేదేవుంది. కానియ్" అనేశాడు.

మర్నాడు ప్రెస్ కాన్ఫరెన్స్‌కి బీభత్సంగా వచ్చారు జనం. ఆ స్టార్ హోటల్ కాన్ఫరెన్స్ రూములో ఇనకేస్తే రాలడం లేదు.

ప్రజాగోల స్టార్ రిపోర్టర్ గుర్నాథం ఆఖరి వరసలో తలుపుకి దగ్గరగా కూచున్నాడు. బయటికి వెళ్ళేటప్పుడు ఎవడి కాళ్ళు ఎవడు తొక్కుతాడో తెలీదు– ఇలాంటి ప్రెస్ కాన్ఫరెన్సుల్లో. కాళ్లు సురక్షితంగా వుండాలంటే ద్వారానికి దగ్గర్లో వాటిని వుంచాలని, సాధ్యమైతే మనం కూడా వాటి దగ్గరే వుండాలని అతనికి అనుభవం నేర్పింది.

తారకరావు ఆనంద పారవశ్యంలో వున్నాడు. ఇటీవల ఎన్నడూ అతగాడి ప్రెస్ కాన్ఫరెన్స్‌కి అంతమంది జనం వొచ్చిన పాపాన పోలేదు.

"సోదర సోదరీమణులారా నేడు మన కెంతో సుదినం"– తారకరావు ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"పరమ పిసినారి తారకరావు మందిప్పిస్తున్న ఈ రోజుని సువర్ణాక్షరాలతో రాయాలి" అంది శ్రోతల్లో ఓ గొంతు.

"కల్లు మానండోయ్ బాబూ కళ్ళు తెరవండోయ్" అని గురజాడ ఆనాడు అమరగానం చేసిన విషయం మనందరికీ తెలును."

తారకరావు వెనకాల కూచున్న పి.ఏ. అతని చొక్కా పుచ్చుకు లాగాడు. రాంగ్ డైలాగ్ వొచ్చినప్పుడు అతనలా లాగుతూ వుం

టాడు. వెంటనే తారకరావు నద్దుకుపోతాడు.

పి.ఏ. చొక్కాలాగి నందువల్ల తను వప్పుల్లో కాలు వేసిన విషయం అర్థమైపోయింది తారకరావుకి.

"ఈ పాట గురజాడ గారు పాడారా, శ్రీశ్రీ గారు పాడాడా అనే విషయం ముఖ్యంకాదు. ఎందుకు పాడారు అనేది ముఖ్యం. అసలు అంత పెద్ద వాళ్ళు అలా పాడుకోవాల్సిన దుస్థితి ఎందుకు వచ్చింది అనే మనం ఆలోచించాలి. మనవే గనక తిన్నగా వుంటే వాళ్ళు పాటలు పాడేబదులు దేశానికి పనికొచ్చే ఇంకేదైనా పని చేసే వాళ్ళు గదా. మనం ఎందుకు తిన్నగా వుండలేకపోయాం? కారణం ఏవిటి? పాలక పక్షమే గదా. వీళ్ళే గదా మనకి తాగుడు, పేకాట, బీడీలు కాల్చడం అన్నీ నేర్పుతున్నది. అంచాత వచ్చే ఎన్నికల్లో నేను ముఖ్యమంత్రిని కాగానే కల్లు నిషేధిస్తా. నా ఆడపడుచుల కోసం రక్తం చిందిస్తా!"

"ఇప్పుడు జరుగుతోంది సారా ఉద్యమం గదా" అన్నాడు కన్ఫ్యూజ్ అయిపోయిన వో రిపోర్టరు.

"సారా కల్లు అనేవి మనం ఏర్పరచుకున్న భేదాలు. దేవుడి దృష్టిలో అన్నీ ఒకటే- నందుని చరితము వినుమా ఆ-ఆ-ఆ- ఆ- పరమానందము..."

పి.ఏ. మళ్ళీ చొక్కా లాగేసరికి సగంలో ఆపేసి మంచినీళ్ళు తాగాడు తారకరావు.

"మీరు అన్నీ తెలిసిన విజ్ఞులు- మీకు చెప్పేదేవుంది. అంచాత కల్లునీ సారానీ బ్రాందీ విస్కీ, ముక్కు పొడుం వగైరాలన్నీ నిషేధించాలని మేం డిమాండ్ చేస్తున్నాం... లేకపోతే రాష్ట్రపతి పాలన..."

పి.ఏ. మళ్ళీ చొక్కాలాగాడు.

"ఒక్కసారానే నిషేధించాలనీ, కల్లుగీత వాళ్ళకి ఏదైనా దోవ చూపించేదాకా నిషేధించరాదనీ మొన్న మీ పార్టీ కార్యవర్గం తీర్మానం చేసింది గదా?" అన్నాడు మరో రిపోర్టరు.

### ఒకేబార్‌లో

"ఇతన్ని ఎందుకు అరెస్ట్ చేసారు" అడిగాడు జడ్జి.

"బాగా తాగి అల్లరి చేస్తున్నాడండీ"

"ఇతను తాగాడని ఎలా చెప్పగలవ్"

"మేం ఇద్దరం ఒకే బార్‌షాపులో తాగామండి" అని నాలిక్కరుచుకున్నాడు కానిస్టేబుల్

పి.సీతారామిరెడ్డి, నాగినేనిప్రోలు

తారకరావు వెనక్కి తిరిగి చూశాడు.

ఆ మాట నిజమే నన్నట్టు పి.ఏ. తలూపాడు.

"ప్రపంచ బాంకు నిధుల్ని పందికొక్కుల్లా మేస్తున్నారు పాలక పక్షం వాళ్ళు" అనేశాడు తారకరావు ఎందుకైనా మంచిదని.

రిపోర్టర్లంతా ఎవళ్ళ జుట్టు వాళ్ళు పీక్కున్నారు. జుట్టు లేనివారు చొక్కాలు చింపేసుకున్నారు.

పరిస్థితి విషమిస్తున్న విషయం గ్రహించి పి.ఏ. వెంటనే డ్రింక్ పత్రమ్మని చెప్పాడు హోటల్ వాళ్ళకి. మరో నిముషానికి పత్రికలు వాళ్ళు తారకరావు గురించి మర్చిపోయారు. నలుగురైదుగురు ఓ గుంపుగా కూచుని లోకాభి రామాయణం మాట్లాడుకోసాగారు.

"ఏదైనాప్రశ్నలుంటే అడగండి"అన్నాడు తారకరావు.

"ఇదేం విస్కీ?"

"చికెన్ టిక్కా చెప్పాం. అది ఎంత సేపట్లో వొస్తుంది?"

"ప్రెస్ కాన్ఫరెన్స్ అయ్యాక ఇళ్ళకు వెళ్ళడానికి కార్లున్నాయా?"

"ఇదేవిటి! ఇలాంటి ప్రశ్నలడుగుతున్నారు.రాజకీయాలడగచ్చుగదా"అన్నాడు తారకరావు గాభరాగా.

"వాళ్ళేం అడుగుతారు సార్. వాళ్ళ బొంద. రాజకీయాలు అర్థం కావడం అంటే మాటలా?" అన్నాడు పి.ఏ.

"అర్థం కాకపోతే మన బోటి వాళ్ళని అడిగి తెలుసుకోవాలిగానీ హోటల్ బేరర్లని అడగాల్సిన ప్రశ్నలు మన్ని అడుగుతారా?"

"పోనీలెండి సార్. మీరు బాధపడకండి. ఇంటికి వెళిపోండి" తక్కిన కార్యక్రమం నేజూసుకుంటా అన్నాడు పి.ఏ.

ఆ రాత్రి ఆ ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసేసరికి ఒంటిగంట అయింది.

"ఇంతకీ ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టింది ఎవడు? వాడేం చెప్పాడో నాలుగు ముక్కలు చెప్పెయ్ గురో" అంటున్నాడు పదమూడో పెగ్గు అందుకున్న వరాంకుశం.

వీడే పేపర్లో పని చేస్తాడో ఎవడికీ తెలీదు. కొన్ని సార్లు మణిపూర్ ట్రిబ్యూన్‌లో పని చేస్తున్నానంటాడు. కొన్నిసార్లు అస్సాంటైమ్స్‌లో అంటాడు. మందు మాత్రం సూపర్ ఫాస్ట్‌గా తాగుతాడు.

"ఇప్పుడు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టింది ప్రతిపక్షనాయకుడు తారకరావుగారు. వారేం చెప్పారంటే..."

"ఏవిటీ ,తారకరావు గాడి ప్రెస్ కాన్ఫరెన్స్‌కి కూడా మనం వొచ్చేస్తున్నావా ఈ మధ్య అంత దిగజారిపోయామా" అంటున్నాడు వరాంకుశం.

తారకరావు పి.ఏ ప్రతి రిపోర్టర్ దగ్గరికీ వచ్చి ముసలాయన అన్న మాటలు పట్టించుకోవద్దనీ, స్టేట్‌మెంట్‌లో వున్నవి మాత్రమే పట్టించుకోమనీ బతిమాలి సైక్లోస్టైల్ చేసిన స్టేట్‌మెంట్ కాపీలు పంచి పెట్టేడు.

తారకరావుని విశాల హృదయంతో క్షమించెయ్యడానికి పత్రికా లోకం అంగీకరించింది. అతని తప్పులన్నీ ఒప్పులుగా భావించడానికి ఒప్పుకుంది.

మూడో రోజున తారకరావు తన ప్రెస్ కాన్ఫరెన్స్ వార్త పత్రికల్లో చూసుకుని సంబరపడిపోయాడు.

"ఏదో అనుకున్నాను గానీ ఈ ప్రెస్సు వాళ్ళు గట్టివాళ్ళే నోయ్. మన స్పీచ్‌లో పాయింట్లన్నీ పట్టేశారు" అన్నాడు ఆనందంగా.

"తమ బొంద. తమరు వాగింది వాగినట్టు వాళ్ళు రాస్తే బుర్రున్న వాడు యవడూ మనకి వోటు వెయ్యడు" అనుకున్నాడు పి.ఏ. మనసులో.

-జొన్నలగడ్డ రాధాకృష్ణ